
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 26.0
కనిష్ఠం 16.2

ANDHRAJYOTHY



సూర్యాపేట

5 మంగళవారం 2 డిసెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	580.10 (283.3042)	37,513	37,513
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.60 (4.36)	879.08	260.19
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.390 (43.3045)	2,100	2,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.230

నాణ్యత డొల్ల ఆరోగ్యం గుల్ల



జిల్లాలో రోజురోజుకూ కాలుష్యం పెరిగిపోతోంది. విచ్చలవిడిగా వాహనాలు, ప్లాస్టిక్ వినియోగం, పరిశ్రమల, ధ్వని కాలుష్యాల కోరల్లో జిల్లా చిక్కుకుంటోంది. ముఖ్యంగా పట్టణాలు, పరిశ్రమల ప్రాంతాల్లో కాలుష్య కారకాల సాంద్రత పెరిగిపోతోంది. గతంలో వీటి సాంద్రత 70 ఉండగా ప్రస్తుతం 178కి చేరింది. దీంతో గాలి నాణ్యత డొల్లగా మారగా, ప్రజల ఆరోగ్యం వాటి బారిన పడి గుల్లవుతోంది.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

» గాలిలో సూక్ష్మధూళి పరిమాణం గతంలో 2.5 మి.మీ. ప్రస్తుతం 19.5 » కాలుష్యకారకాల సాంద్రత గతంలో 70, ప్రస్తుతం 178

జిల్లాలో కాలుష్యపు రాకసి పంజా విసురుతోంది. పట్టణ, గ్రామాలు తేడా అన్నిచోట్ల గాలిలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోంది. గాలిలో నాణ్యత తక్కువగా ఉండటంతో ప్రజలు వివిధ రోగాల బారిన పడుతున్నారు. కాలుష్యం నివారణకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. మానవులతో పాటు అన్నిరకాల జీవరాసులపై కాలుష్యం ప్రభావం తీవ్రంగా చూపుతోంది.

గతంలో గాలి నాణ్యత సూచిక(ఏక్యూఐ)లో కాలుష్య కారకాల సాంద్రత 70 ఉండేది. ప్రస్తుతం 178కి చేరింది. సాధారణంగా ఏక్యూఐలో 50 లోపు ఉంటే నాణ్యతతో కూడిన గాలిగా పేర్కొంటారు. 51 నుంచి 100 వరకు ఉంటే సాధారణంగా 101 నుంచి 150కు పైగా ఉంటే అధ్వానంగా పరిగణిస్తారు. అయితే రెండు రోజులుగా ఏక్యూఐలో కనిష్ఠంగా 130 నమోదు కాగా సోమవారం 178గా నమోదైంది. అదేవిధంగా గాలిలోని సూక్ష్మధూళి కణాలు గతంలో 2.5 మైక్రోమీటర్ల వ్యాసం ఉండగా ప్రస్తుతం 19.5గా నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్రవ్యాధులకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. ముఖ్యంగా సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ పట్టణాలలో కాలుష్య ప్రభావం తీవ్రంగా ఉంటోంది. వీటితో పాటు ఎక్కువగా పరిశ్రమలు ఉన్న మేళ్లచెర్వు, మల్లారెడ్డిగూడెం, మఠంపల్లి ప్రాంతాలలో కాలుష్యం తీవ్రంగా ఉంది.

పెరిగిన వాహనాల వినియోగం

పలురకాల కాలుష్యాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఎక్కువగా వాయికాలుష్యం ప్రభావం చూపుతోంది. వాహనాలు, వివిధరకాల పరిశ్రమల నుంచి వెలువడే పొగతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లాలో 2024లో కొత్తగా 66,624వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా 2025 నాటికి 60,125 వాహనాలు రిజిస్ట్రేషన్‌లు అయ్యాయి. రోజురోజుకు వాహనాల



వాడకం పెరుగుతోంది. దీంతో వాహనాలతో గాలిలో కాలుష్యం పెరుగుతోంది. అతి సూక్ష్మ ధూళి కణాలు ప్రజలు పీల్చే గాలి ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్లాస్టిక్ వాడకంతో జలకాలుష్యం పెరిగింది. డంపింగ్ యార్డుల్లో చెత్తను కాల్చడంతో విషవాయువులు వెలువడుతున్నాయి. దీంతో శ్వాస కోశ సంబంధిత వ్యాధులతో పాటు మూత్రపిండాల వ్యాధుల బారిన పడుతున్నారు. గాలి కాలుష్యంతో విచ్చలవిడి హారన్, శబ్ద యంత్రాల మోతలతో ధ్వని కాలుష్యం సైతం పెరిగింది. దీంతో చెవులు దెబ్బతింటున్నాయి. జల...

- మిగతా 8వ పేజీలో...

అధికారుల పర్యవేక్షణ లేకనే...

కాలుష్యపు కోరల నుంచి ప్రజలను కాపాడే విషయంలో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ముఖ్యంగా కాలం తీరిన వాహనాలను అరికట్టడంలో రవాణా శాఖ అధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక ప్రతీ వాహనం, పరిశ్రమలకు పొల్యూషన్ సర్టిఫికెట్‌ను అందించాల్సి ఉంది. ఈ విషయంలో సంబంధిత శాఖ అధికారులు అన్ని కోణాల్లో పరిశీలించాకే సర్టిఫికెట్‌ను ఇవ్వాల్సి ఉండగా అధికారులు మాత్రం తూతూ మంత్రంగా పరిశీలించి వాటికి అనుమతులు ఇస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వీటితో యథేచ్ఛగా కాలుష్యం వెదజల్లుతుంది.

అయ్యప్ప మాలధారుల గిరి ప్రదక్షిణ

- రాష్ట్ర వ్యాప్తంగా పెద్దసంఖ్యలో తరలివచ్చిన అయ్యప్పస్వాములు
- మాలధారులకు ప్రత్యేక దైవదర్శనం, అనంతరం ప్రసాద వితరణ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు సామూహిక గిరిప్రదక్షిణ నిర్వహించారు. సోమవారం రాష్ట్ర నలుమూలల నుంచి అయ్యప్ప మాలధారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నృసింహుడి శరణఘోషతో ఆలయ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. అయ్యప్ప మాలధారులైన గోమాత గురుస్వాములు, కన్య స్వాములకు దేవస్థానం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, తదితరులు పాల్గొన్నారు. 7



శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలి: ఎస్పీ



పెన్‌పహాడ్ మండల కేంద్రంలో మాట్లాడుతున్న ఎస్పీ కె.నరసింహ

పెన్‌పహాడ్, చిలుకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతియుతంగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎస్పీ కె.నరసింహ అన్నారు. రెండో విడత ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా సోమవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంతో పాటు గాజులమల్కాపురం, చీదెళ్ల, గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను, చిలుకూరు మండంలోని బేతవోలు గ్రామంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, గ్రామాల్లో అలజడులు సృష్టించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యాత్మక గ్రామాలను సిబ్బంది గుర్తించాలన్నారు. ప్రజలకు ఎన్నికల నిబంధనలను వివరించాలని, ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఓటర్లు ప్రలోభాలకు ఆశపడకుండా ఓట్లు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్నకుమార్, శ్రీనివాసరెడ్డి, సీఐలు రాజశేఖర్, ప్రతాపలింగం స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్ఐ గోపీకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఎస్పీ సాయం

చివ్వెంల: రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు ఎస్పీ నరసింహ సాయం అందించారు. చివ్వెంలకు వెళుతున్న బొలేరో వాహనం ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి సూర్యాపేట- ఖమ్మం రహదారిపై బోల్తా పడింది. ఇదే సమయంలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలించడానికి అటుగా వెళుతున్న ఎస్పీ నరసింహ, అక్కడ ఆగి క్షతగాత్రులను సిబ్బందితో కలిసి వాహనం నుంచి బయటికి తీయించి సూర్యాపేట ఆసుపత్రికి పంపారు. సిబ్బందితో కలిసి వాహనాన్ని రోడ్డుపై నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలి



సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల విధులను రిటర్నింగ్ అధికారులు నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఫేస్-2 రిటర్నింగ్ అధికారులకు సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అభ్యర్థి రోజువారి ఎన్నికల ఖర్చు వివరాలను తనిఖీ చేయా లన్నారు. వివరాలు ఇవ్వడంలో విఫలమైన అభ్యర్థులకు నోటీసులు జారీ చేయాలన్నారు. నామినేషన్, పోలింగ్, ఫలితాల వరకు అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఓటర్లకు బీఎల్వోల ద్వారా ఫొటో ఓటరు స్లిప్‌లను పంపిణీ చేయాలన్నారు. సిబ్బందిని పోలింగ్ స్టేషన్‌కు పంపడం, సామగ్రి సరఫరా, పర్యవేక్షణ, కౌంటింగ్ ప్రదేశం, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు, ఫలితాలు ప్రకటన, ఎన్నిక ధ్రువీకరణ పత్రాల పంపిణీని రిటర్నింగ్ అధికారులు సమర్థంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డీపీవో యాదగిరి, డీఆర్‌డీఏ పీడీ వీవీ అప్పారావు, డీఎఫ్‌వో సతీష్, ట్రైనర్లు రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరగాలి

చివ్వెంల, మోతె: స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండో విడత నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరగాలని కలెక్టర్ అన్నారు. సోమవారం చివ్వెంల మండలంలోని బండమీది చందుపట్లలో నామినేషన్ కేంద్రాలను, మోతె మండల కేంద్రంతో పాటు మామిళ్లగూడెం నామినేషన్ కేంద్రాలను ఆయ పరిశీలించి మాట్లాడారు. చివరి రోజు నామినేషన్లు భారీగా వేస్తారని, ఎలాంటి అల్లర్లు, గొడవలు , ర్యాలీలు చేయకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్లస్టర్లలో నామినేషన్ వేసే అభ్యర్థులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు చంద్రశేఖర్, ఎం.వెంకన్న, ఎంపీవో దయాకర్, ఎంపీడీవో ఆంజనేయులు, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలకు ఐదు అంచెల భద్రత

సూర్యాపేటక్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ఐదు అంచెల పోలీసు భద్రత ఏర్పాటు చేశామని ఎస్పీ నర్సింహ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నియావళిని ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. ఎన్నికలు ఓ పండుగలా జరగాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలని, పోలీస్ శాఖ పూర్తి రక్షణ కల్పిస్తుందని అన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పాత నేరస్థులకు బైండోవర్‌చేస్తున్నామన్నారు. ఓటర్లకు ప్రలోభాలకు గురిచేయకుండా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రం, జిల్లా సరిహద్దుల వెంట ఏడు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి 23 గంటలు తనిఖీలు చేస్తున్నామన్నారు మూడు విడతల్లో జరుగుతున్న ఎన్నికల్లో ప్రతి విడతకు 1500 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. వీరిలో రూట్ మొబైల్స్, ఎస్పీ ఆధ్వర్యంలో స్పెషల్ కింగ్ ఫోర్స్, డీఎస్పీ ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్, 100 మీటర్ల పరిధిలో సిబ్బంది ఎన్నికల నిర్వహణలతో ఉంటారన్నారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి

చివ్వెంల: పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ అన్నారు. సోమవారం చివ్వెంల మండలంలోని చందుపట్లలో రెండో విడతలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. నామినేషన్ వేసిన అభ్యర్థులతో, గ్రామస్థులతో మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాలను సందర్శించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ముందు 48 గంటలు నిబంధనలు అమల్లో ఉంటాయన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్, రామారావు, ఎస్ఐ మహేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ మద్దతుదారుల విజయం ఖాయం

తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి



సూర్యాపేటలో మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు అభ్యర్థుల విజయం ఖాయమని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజల కు ఇచ్చిన హామీలను రెండేళ్లుగా నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉన్నారన్నారు. ప్రభుత్వ సేవలు ఇంటి వద్ద అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో 4.5లక్షల ఇళ్లను నిర్మించిందని, వాటిని పేదలకు అందజేస్తున్నామన్నారు.

కేసీఆర్ 10ఏళ్ల పాలనలో అప్పులపాలైన రాష్ట్రాన్ని అభివృద్ధిలో పయణించేలా కాంగ్రెస్ పాలన ఉందన్నారు. కాంగ్రెస్ మద్దతు ఉన్న అభ్యర్థులను ఏకగ్రీవం చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, నాయకులు వూర రామూర్తియాదవ్, వెలుగు వెంకన్న, జ్యోతి కర్నాకర్, ఫరూఖ్, వల్దాస్ దేవేందర్, నేరేళ్ల మధుగౌడ్, బైరబోయిన శ్రీనివాస్, సైదిరెడ్డి, బానాల వెంకన్న యాట వెంకన్న పాల్గొన్నారు.

రోజుకు 16వేల బస్తాలు

సూర్యాపేట మార్కెట్‌కు భారీగా ధాన్యం రాక

20 రోజుల్లో 4.50 లక్షల బస్తాల కొనుగోళ్లు

రాష్ట్రంలో అతిపెద్ద మార్కెట్లలో ఒకటైన సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు భారీగా వ్యవసాయ ఉత్పత్తులను రైతులు భారీగా తరలిస్తున్నారు. ఈ ఏడాది వానాకాలం సీజన్ ఉత్పత్తులతో మార్కెట్ కళకళలాడుతోంది. గత 20 రోజుల్లో మార్కెట్‌కు 4.50 లక్షల బస్తాల ధాన్యం వచ్చింది. అందులో రికార్డు స్థాయిలో నవంబరు 25న 40,170 బస్తాల ధాన్యం వచ్చింది. ఇటీవల ధాన్యానికి మంచి ధరలు వస్తుండటంతో మార్కెట్‌కు రైతులు ధాన్యాన్ని తరలిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-భానుపురి)

వానాకాలం సీజన్ కొనుగోళ్లు ప్రారంభమైన నాటి నుంచి సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ ధాన్యపు రాశులతో కనిపిస్తోంది. ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా మార్కెట్‌లో మంచి ధరలు వస్తుండటంతో ధాన్యాన్ని ఇక్కడికే రైతులు తరలిస్తున్నారు. గ్రేడ్-1 ధాన్యానికి క్వింటాకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,363 ధరలు ఉండగా, అంతకుమించి ధరలు పలుకుతున్నాయి. సన్నధాన్యానికి రూ.3,228 నుంచి రూ.3000 వరకు ధర పలుకుతుండటంతో రైతుల్లో మరింత విశ్వాసం పెరిగి మార్కెట్‌కు ధాన్యం తరలిస్తున్నారు. మద్దతు ధరకు మించి ఎక్కువ ధరలు పలుకుతున్నాయి. జైశ్రీరాం, ఐఆర్-64 రకం, హెచ్ఎంటీ, బీపీటీ రకాల ధాన్యాన్ని రైతులు ఎక్కువగా తీసుకువస్తున్నారు. వీటితో పాటు కందులు, పెసర, వేరుశనగ పంటలను సైతం మార్కెట్‌కు రైతులు తీసుకువస్తున్నారు. అయితే ఇటీవల రైతుల కోసం మార్కెట్‌లో రూ.5లకే భోజనం పథకం అమల్లోకి తీసుకువచ్చారు. సోమవారం నుంచి రైతులకు అల్పాహారం ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పాలకవర్గం చెబుతోంది. మార్కెట్‌లో అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని, పంటలకు మంచి ధర వస్తున్నాయని మార్కెట్ కార్యదర్శి ఫసియొద్దీన్ తెలిపారు.

రోజుకు 16 వేల చొప్పున...

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై ఉండడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడికి తరలిస్తున్నారు. నవంబరు 10 నుంచి కొనుగోళ్లు మొదలయ్యాయి. ఈ నెల 1వరకు రోజుకు 16000 వేల బస్తాలకు తగ్గకుండా ధాన్యం మార్కెట్‌కు వస్తోంది.

సోమవారం మార్కెట్‌కు పంటల రాక

రకం	బస్తాలు	గరిష్ఠం	కనిష్ఠం
జైశ్రీరాం	13,265	రూ.3,238	రూ.1,509
బీపీటీ	7060	రూ.2,309	రూ.1,519
ఐఆర్-64	1271	రూ.2,058	రూ.1,509
హెచ్ఎంటీ	3112	రూ.2,757	రూ.1,659

మార్కెట్ అభివృద్ధికి కృషి



సూర్యాపేట మార్కెట్‌లో అల్పాహారం పంపిణీ చేస్తున్న చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పక్కన మార్కెట్ కార్యదర్శి ఫసియొద్దీన్

భానుపురి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం మార్కెట్ యార్డులో సూర్యాపేట లయన్స్‌క్లబ్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. రైతుల సంక్షేమానికి రైతు బంధు, ఉచిత కరెంట్, రైతుబీమా, కొనుగోలు కేంద్రాలు తదితర సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. రైతులకు వ్యవసాయంపై ఆసక్తి పెరిగి పంటలు సాగు చేస్తున్న వారి సంఖ్య పెరిగిందన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం ముందడుగు వేసి రైతులు, హమాలీలకు ఇటీవల ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసిందన్నారు. మార్కెట్‌కు చుట్టుపక్కల గ్రామాల రైతులు తమ ధాన్యాన్ని విక్రయించడానికి తెల్లవారుజామున నుంచి రాత్రి వరకు ఇక్కడే ఉంటున్నారని, వారి కోసం రూ.5లకే నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి ఫసియొద్దీన్, సూర్యాపేట లయన్స్ క్లబ్ కమిటీ సభ్యులు పెండెం చంద్రశేఖర్, లక్ష్మారెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు తిరుమలరావు, మార్కెట్ సహాయ కార్యదర్శి వెంకటరెడ్డి, యూడీసీ ఖాసీం ఉన్నారు.

బీసీలపై వివక్ష తగదు

- కోమటిరెడ్డికి బీసీ సంఘం నేతల లేఖ



మంత్రి కోమటిరెడ్డికి లేఖను చూపుతున్న బీసీ సంఘం నేతలు

నేరేడుచర్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బీసీలపైన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వివక్ష చూపుతున్నారని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నేరేడుచర్లలోని కార్యాలయంలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో మంత్రికి బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లా డీసీసీ అధ్యక్ష పదవి బీసీ సామాజిక వర్గానికి చెందిన పూర్ణ కైలాస్‌కు ఇవ్వడాన్ని మంత్రి వ్యతిరేకించారన్నారు. ఇప్పుడేమో నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెం గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి మామిడి యాదగిరిని కిడ్నాప్ చేసి భయభ్రాంతులకు గురి చేయడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం కోసం పదవీ త్యాగం చేసిన కోమటిరెడ్డి ఈ విధంగా ఎందుకు ప్రవర్తిస్తున్నాడో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా బీసీ వ్యతిరేకతకు స్వస్తి పలకాలని, లేదంటే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చిలకరాజు శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మరాజు వెంకట్, బత్తిని శ్రీనివాస్, బండి శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమయ్య

హుజూర్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట ఉపాధ్యక్షుడు ఎలక సోమయ్యగౌడ్ కోరారు. సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించడం దుర్మార్గమన్నాని అన్నారు. సంక్షేమ బోర్డును ప్రైవేట్ బీమా కంపెనీలకు అప్పగించొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ ముస్తఫా, వెంకన్న, నరేష్, నాగులుమీరా, కృష్ణ రాజేష్, గోవింద్, అంజయ్య పాల్గొన్నారు.

యాతవాకిళ్ల.. ఆ కుటుంబానిదే హవా

- ఒకే కుటుంబం నుంచి నలుగురు సర్పంచ్‌లు
- 23 ఏళ్ల పాటు వారి పాలనలోనే గ్రామం



విశాలాంధ్ర(రౌండప్‌లో)తో కుమారులు, కోడలు


(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని యాతవాకిళ్ల గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ 1988 నుంచి సర్పంచ్‌లుగా ఎన్నికైన వారిలో రిజర్వేషన్ మినహాయిస్తే మిగతా సమయాల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సర్పంచులుగా కొనసాగారు. కమ్యూనిస్టు సీనియర్ నాయకుడు కోలహలం పున్నంరాజు మృతితో ఆయన భార్య విశాలాంధ్ర 1988 ఎన్నికల్లో హనుమంతులగూడెం, యాతవాకిళ్ల ఉమ్మడిగా ఉన్న పంచాయతీకి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అప్పటి ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఎన్నికైన ఏకైక మహిళ ఆమె. అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చినప్పటికీ గ్రామ పాలనలో తనదైన ముద్ర వేసి అధికారులతో పాటు గ్రామస్థుల మన్ననలు పొందారు. ప్రధానంగా డ్రైనేజీలు, అంతర్గత రహదారుల నిర్మాణాలు చేపట్టి తాగునీటి కోసం ప్రతి వీధిలో జీఎల్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మించారు. చిన్నారుల కోసం అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు ఆమె హయంలోనే జరిగింది. ప్రస్తుతం హనుమంతులగూడెం, యాతవాకిళ్ల రెండు పంచాయతీలుగనా కొనసాగుతున్నాయి. అయితే ఆమె స్ఫూర్తితోనే ఇద్దరు కుమారులు, కోడలు సర్పంచ్‌లుగా సేవలు అందించారు. కోలహలం విశాలాంధ్ర 1988 నుంచి 1995 వరకు ఏడేళ్లు సర్పంచిగా పనిచేయగా ఆమె పెద్ద కుమారుడు కోలహలం కృష్ణంరాజు 1995 నుంచి 2000 వరకు, కోడలు కృష్ణంరాజు సతీమణి కోలహలం పద్మ 2000 నుంచి 2005 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. ఆ తరువాత వరుసగా రెండుసార్లు సర్పంచ్ స్థానం ఎస్టీ, ఎస్సీలకు కేటాయించడంతో వీరికి అవకాశం లేకుండాపోయింది. తిరిగి 2019 బీసీ జనరల్ కావడంతో ఆ ఎన్నికల్లోనూ విశాలాంధ్ర చిన్నకుమారుడు లక్ష్మీనరసింహారాజు సర్పంచ్‌గా గెలుపొందారు. కాగా ప్రస్తుతం యాతవాకిళ్ల సర్పంచ్ స్థానం ఎస్సీ మహిళకు కేటాయించారు. మొత్తంగా కోలహలం పున్నంరాజు కుటుంబ సభ్యులు 1988 నుంచి వివిధ సందర్భాల్లో 23 ఏళ్ల పాటు సర్పంచ్‌లుగా సేవలందించారు.

వస్తే సర్పంచ్ పదవి.. పోతే ఎకరం



- పైసలుంటేనే పంచాయతీ బరిలో..
- జనరల్ స్థానాల్లో రూ.10 నుంచి రూ.25 లక్షలు
- రిజర్వుడ్ స్థానాల్లో రూ.10 లక్షల వరకు



(ఆంధ్రజ్యోతి-నిడమనూరు)

పంచాయతీ ఎన్నికలను పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. డబ్బులు ఖర్చు పెట్టేవారినే సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో ఉంచేందుకు పార్టీల నాయకులు చర్చలు జరుపుతున్నారు. దీంతో ఖర్చు భరించేవారినే అభ్యర్థులుగా ఎంపిక చేసే యోచనలో ఉన్నారు. పార్టీలలో క్రియాశీలకంగా పనిచేస్తూ పోటీ చేయాలని ఉత్సాహం,ఆసక్తి ఉన్న వారికి సైతం సరైన ఆర్థిక స్తోమత లేకపోతే అభ్యర్థులుగా అవకాశం కల్పించే పరిస్థితులు కనిపించడం లేదు. గ్రామానికి సేవ చేయాలనే తపన ఉన్నప్పటికీ డబ్బు లేకపోతే ఎన్నికల్లో పోటీచేసే పరిస్థితులు లేవు. సామాజికవర్గం సమీకరణలు, ప్రజాదరణతో పాటు ఆర్థిక బలం ఉన్న వారిని అన్వేషిస్తున్నారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలో 29 పంచాయతీలు ఉండగా, ఎస్టీలకు ఒకటి, ఎస్సీలకు ఆరు, బీసీలకు ఏడు పంచాయతీలు రిజర్వు కాగా మిగతా 15 పంచాయతీలు జనరల్‌కు కేటాయించారు. ముఖ్యంగా జనరల్, బీసీ స్థానాల్లో పోటీకి తీవ్ర పోటీ ఉంది. ఎంత ఖర్చయినా కొందరు వెనుకాడటం లేదు. ఆశావహులు తమ అభ్యర్థిత్వాలు ఖరారు కాకముందే గ్రామాల్లో ప్రతిరోజూ వేలల్లో ఖర్చు చేస్తున్నారు. సమావేశాలు పెడుతూ తనకే మద్దతు ఇవ్వాలని కోరుతూ ఖర్చు పెడుతున్నారు. జనరల్ పంచాయతీల్లో రూ.10 నుంచి రూ.25 లక్షలు, అదేవిధంగా రిజర్వుడ్ పంచాయతీల్లో కనీసం రూ.10 లక్షలు ఖర్చు పెట్టేవారికి అవకాశం ఇవ్వాలని పార్టీల నాయకులు చూస్తున్నారు. ఆయకట్టు గ్రామాల్లో సర్పంచ్ పదవికి ఎక్కువ డిమాండ్ ఉంది. అక్కడ రూ.50 లక్షల వరకు ఖర్చు పెట్టేందుకు పలువురు సిద్ధంగా ఉన్నారు. కొన్నిగ్రామాల్లో రూ.25నుంచి రూ.40లక్షలు ఖర్చు చేసేందుకు సిద్ధమే అంటున్నారు. వస్తే సర్పంచ్ పదవి..పోతే ఎకరం భూమి అంటూ బరిలో నిలిచేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మంచి ముహూర్తం.. చూడు పంతులూ..



(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

గ్రామపంచాయతీ ఎన్నికల సంగ్రామంలో రెండోవిడత నామినేషన్ల పర్వం మంగళవారంతో ముగియనుంది. మూడోవిడతకు సంబంధించి బుధవారం నుంచి నామినేషన్లు ప్రారంభం అవుతాయి. చివరివిడతలో ఉన్న సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో ఆశావహులు సెంటిమెంట్లకు పదును పెట్టారు. సర్పంచ్, వార్డుస్థానాలకు పోటీ చేసే వారు తమ నామినేషన్లు ఏ శుభఘడియల్లో వేయాలని ఆరా తీస్తూ పురోహితులను ఆశ్రయిస్తున్నారు. మూడో విడతలో ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నామినేషన్ల పర్వం కొనసాగనుంది. అందులో 3వ తేదీ త్రయోదశితో పాటు బుధవారాన్ని శుభకరంగా భావిస్తారు. అదేవిధంగా 4వ తేదీ దత్తాత్రేయ జయంతి ఉన్నా చతుర్దశితో పాటు యుక్తపౌర్ణమితో అంతగా యోగ్యమైన ముహూర్తంగా భావించరు. ఇక 5వ తేదీ లక్ష్మీవారమైన శుక్రవారంతో పాటు పాడ్యమి తిథి కావడంతో శుభముహూర్తంగా పండితులు చెబుతున్నారు. దీంతో మూడో విడతలో చివరిరోజు నామినేషన్లు ఎక్కువసంఖ్యలో వేసే అవకాశాలు ఉన్నాయి.

రాశి, నక్షత్రాల ఆధారంగానే..



నామినేషన్లు వేసేందుకు శుభఘడియలు ఆయా అభ్యర్థి రాశి, నక్షత్రాల ఆధారంగా నిర్ణయించబతాయి. అభ్యర్థులందరికీ ఒకే రకమైన ముహూర్తాలు ఉండవు. వారి నక్షత్రాలను అనుసరించి శుభగడియ నిర్ణయిస్తాం. ముహూర్తబలం ఒకవైపు దైవబలం ఇంకో వైపు జాతక బలంతో పాటు దైవబలం తోడైన వారికి విజయం వరిస్తుంది. అభ్యర్థుల బలాన్ని బట్టి నామినేషన్ వేస్తే కీడు తొలగి మంచి జరిగి ఫలితం వస్తుంది.

మార్తి రమణశాస్త్రి, పురోహితుడు, మఠంపల్లి

ఆలయ నిర్మాణం కోసం తీర్మానం

- చొప్పరివారిగూడెంలో సర్పంచ్ పదవి వేలం
- రూ.18.16 లక్షలకు దక్కించుకున్న కాంగ్రెస్ మద్దతుదారు

చండూరు రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చండూరు మండలంలో మరో గ్రామపంచాయతీ ఏకగ్రీవమైంది. చొప్పరివారిగూడెం సర్పంచ్ పదవి కోసం గ్రామపెద్దలు వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో రూ.18.16 లక్షలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు అభ్యర్థి జాల వెంకన్నయాదవ్ సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసుకున్నాడు. సర్పంచ్ పదవికి ఐదుగురు నామినేషన్ దాఖలు చేయగా వేలం పాటలో నలుగురు పాల్గొన్నారు. ఒకరు అందుబాటులో లేడు. ఏదిఏమైనా ఒకవేళ అతడు పోటీలో ఉన్నా సరే గ్రామస్థులంతా ఏకమై ఏకగ్రీవంగా వెంకన్నను గెలిపించుకోవాలని తీర్మానించారు. వేలం పాట ద్వారా సమకూరిన డబ్బుతో ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించుకోవాలని గ్రామస్థులు తీర్మానించారు.

ఆ దంపతులు గ్రామానికి నిర్మల్ అవార్డు తెచ్చిపెట్టారు

స్ఫూర్తి




జటంగి శంకర్, లక్ష్మి

శాలిగౌరారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం రామాంజపురం గ్రామంలో భార్యభర్తలు సర్పంచ్‌లు గెలిచి వారి హయాంలో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. 791 ఓటర్లు కలిగిన ఈ గ్రామంలో 411 పురుషులు, 380 మహిళా ఓటర్లు ఉన్నారు. గ్రామానికి 2006 నుంచి 2011 వరకు గ్రామానికి చెందిన జటంగి లక్ష్మి సర్పంచ్‌గా పనిచేశారు. ఈ హయాంలో కేంద్ర ప్రభుత్వం గ్రామానికి నిర్మల్ పురస్కార్ అవార్డు ప్రకటించగా మహారాష్ట్ర రాష్ట్రం పుణెలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును ఆమె అందుకున్నారు. లక్ష్మి భర్త జటంగి శంకర్ కూడా 2019 నుంచి 2024 వరకు సర్పంచ్‌గా చేశారు. భార్యాభర్తలిద్దరూ సర్పంచులుగా ఎన్నికై గ్రామంలో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేశారు. గ్రామాన్ని జాతీయ స్థాయిలో నిలిపి అవార్డు రావడానికి శ్రమించారు.

రోడ్డేస్తేనే ఓటేస్తాం

- వాట్సాప్‌లో ఫ్లెక్సీ హల్‌చల్
- వేములపల్లి ఎన్ఎస్పీ కాలనీవాసుల వినూత్న నిరసన



వాట్సాప్‌లలో వైరల్ అవుతున్న ఫ్లెక్సీ పోస్టర్

(ఆంధ్రజ్యోతి-వేములపల్లి)

తమ కాలనీకి సర్వీస్ రోడ్డు వేస్తేనే ఓటు వేస్తాం.. లేదంటే ఓటింగ్‌ను బహిష్కరిస్తామంటూ ఫ్లెక్సీ వాట్సాప్‌లో చక్కర్లు కొడుతోంది. నల్లగొండ జిల్లా వేములపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్ఎస్పీ క్యాంప్ కాలనీకి రాకపోకలు సాగించాలంటే వేములపల్లి మండల కేంద్రం నుంచి నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై రాంగ్ రూట్‌లో ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకొని ప్రాణాలు కోల్పోతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై పలుమార్లు గ్రామ ప్రజాప్రతినిధులు తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామంలో జరగబోయే ఎన్నికలను పూర్తిగా బహిష్కరిస్తామంటూ ఎన్ఎస్పీ కాలనీ ప్రజలు వాట్సాప్ గ్రూపులో షేర్ చేస్తున్నారు. దీంతో పలు రాజకీయ పార్టీల నాయకులు కాలనీవాసులను నచ్చజెప్పే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామంలోని ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులతో మాట్లాడి రోడ్డు వేయిస్తామని హామీ ఇస్తే తప్పా ఓట్లు వేసేది లేదని పేర్కొంటున్నారు.

అడ్వాన్స్‌గా రూ.50 లక్షలు డిపాజిట్

- ఏకగ్రీవం చేస్తే మరో రూ.10 లక్షలు

కోదాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లాలో సర్పంచ్ పదవికి తనను ఏకగ్రీవం చేయాలని ఓ వ్యక్తి ముందస్తుగా రూ.50 లక్షలు డిపాజిట్ చేశాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ మండలం నల్లబండగూడెం సర్పంచ్ పదవికి తనను ఏకగ్రీవం చేయాలని అల్సకాని భవానీశరబయ్య కోరారు. ఏకగ్రీవం చేసినట్లయితే గ్రామ అభివృద్ధి కోసం రూ. 60 లక్షలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని, ఇప్పటికే గ్రామపెద్దల సమక్షంలో రూ. 50 లక్షలు డిపాజిట్ చేశానన్నారు. పోటీ లేకుంటే మరో రూ.10 లక్షలు మొత్తం రూ.60లక్షలను గ్రామ అభివృద్ధికి ఖర్చు చేస్తానన్నారు. గ్రామస్థులు సహకరించాలని కోరారు.

ఎన్నికల్లో బెదిరింపులకు పాల్పడుతున్న ఎమ్మెల్యే

నకిరేకల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నకిరేకల్ నియోజకవర్గంలో పంచాయతీ ఎన్నికల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు పాల్పడుతూ ఏకగ్రీవం చేసేందుకు నిరంకుశత్వంతో ప్రయత్నిస్తున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయపార్టీల నాయకులు ఎవరూ పోటీలో ఉండకూడదన్న ధోరణితో కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే వీరేశం తన పదవికి రాజీనామా చేసి తనపై పోటీచేసి గెలిస్తే రాజకీయాలకు స్వస్తి పలుకుతానన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఏమాత్రం అభివృద్ధి జరుగలేదన్నారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, పెండెం సదానందం, రావిరాల మల్లయ్య, దైద పరమేశం, గుర్రం గణేష్, టి. ప్రభాకర్ రావు, పల్లె విజయ్, రాచకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ తిరస్కరణపై ఆందోళన




పాతర్లపహాడ్‌లో ఆందోళన చేస్తున్న నామినేషన్ తిరస్కరణకు గురైన వ్యక్తులు, వివరాలు వెల్లడిస్తున్న అధికారి

ఆత్మకూరు(ఎస్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నామినేషన్ల తిరస్కరణకు కారణం చెప్పకపోవడంతో అభ్యర్థులు ఆందోళన బాటపట్టారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలోని పాతర్లపహాడ్, తుమ్మలపెన్‌పహాడ్ గ్రామాల్లో సోమవారం ఆందోళన చేశారు. మొదటి విడతలో భాగంగా మం డలంలోని సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ నవంబరు 29వ తేదీతో ముగిసింది. 30వ తేదీన నామినేషన్లను పరిశీలించాల్సిన అధికారులు అర్ధరాత్రి దాకా పరిశీలన చేసి పలు కారణాలు చూపించి కొంతమంది నామినేషన్లలో తప్పులు ఉన్నాయని తిరస్కరించారు. అయితే సోమవారం తిరస్కరణకు గురైన నామినేషన్ పత్రాలను ఆర్డీవోకు అప్పీలు చేసుకోవాలని చెప్పడంతో బాధితులు నామినేషన్ల క్లస్టర్ కార్యాలయాల ముందుకు చేరుకున్నారు. నామినేషన్లలో ఏమి ఉన్నాయో తెలపాలంటూ రిటర్నింగ్ అధికారులను కోరారు. వారు తాము ఏం చెప్పమని ఆర్డీవో వద్ద దరఖాస్తు చేసుకోవాలని సమాధానం చెప్పారు. దీంతో తప్పేంటో చెప్పకుండా ఆర్డీవోకు ఎలా అప్పీలు చేసుకోవాలంటూ బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు, అభ్యర్థులకు మధ్య కొంత సమయం వరకు వాగ్వాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న మండల అధికారులు ఎంపీడీవో హసీం, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ ఇరుపక్షాలకు సర్దుచెప్పి నామినేషన్లలో జరిగిన తప్పులను బాధిత అభ్యర్థుల ముందు రిటర్నింగ్ అధికారికి చదవి వినిపించారు. దీంతో ఆందోళన విరమించి ఆర్డీవోకు అప్పీలు చేసుకోవడానికి సూర్యాపేట తరలివెళ్లారు.

భారీగా నామినేషన్ల తిరస్కరణ

మండలంలో 30 గ్రామాలు, 274 వార్డులు ఉన్నాయి. సర్పంచ్ స్థానాలకు 290 మంది, వార్డుసభ్యులకు 795మంది నామినేషన్లు దాఖాలు చేశారు. కాగా ఆదివారం వాటిని పరిశీలించిన అధికారులు 37మంది సర్పంచ్ అభ్యర్థులు, 72 మంది వార్డుసభ్యుల నామినేషన్లను తిరస్కరించారు. నామినేషన్ రద్దయిన వారు ఆర్డీవోకు అప్పీలు చేసుకోవాలని అధికారులు సూచించారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

నాగార్జునసాగర్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 3వ తేదీన హైదరాబాద్‌లోని సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించే జర్నలిస్టుల మహాధర్నాను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం సాగర్ హిల్‌కాలనీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త అక్రిడిటేషన్లు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఆరోగ్య బీమా, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్, రవి, విజయ్, సత్యనారాయణ, రాజు, అప్పారావు, శివరాం ప్రసాద్, హరికృష్ణ, శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటి మట్టం 580 అడుగులు

నాగార్జునసాగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 580.10 అడుగులుగా (283.3042 టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 6,006 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 5,226 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 24,481 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

దారి తప్పితే..



నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా ఇది. నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై పట్టణంలో వచ్చే ప్రధాన మలుపు. నిత్యం రద్దీగా ఉండే ఇక్కడ నూతన రోడ్డు నిర్మాణంలో భాగంగా ఎత్తుగా మట్టి పరిచి రోడ్డు నిర్మించారు. నల్లగొండ నుంచి పట్టణంలోకి వెళ్లే వాహనదారులు ఈ గడ్డమీది నుంచే ఒక్కసారిగా ఎడమ వైపుకు మళ్లాల్సి ఉంటుంది.



వాహనాలు అదుపు తప్పితే ఏమవుతుందో చెప్పడానికి మచ్చుతునక ఆదివారం రాత్రి జరిగిన సంఘటన. నల్లగొండ నుంచి నార్కట్‌పల్లికి వస్తున్న డీసీఎం అదుపు తప్పి ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌లోకి దూసుకెళ్లింది. రోడ్డుపై ఉన్న దుకాణాలను ధ్వంసం చేస్తూ సెల్లార్ మెట్ల మార్గంలోకి వెళ్లి ఆగింది. ఈ ఘటనలో యువకుడు మృతి చెందాడు. నిత్యం ఏదో వాహనం అదుపు తప్పి ముందుకు వెళ్తుందని స్థానికులు తెలిపారు.



అసంపూర్తి రోడ్డు కారణంగానే

అసంపూర్తి రోడ్డు కారణంగానే డీసీఎం ప్రమాదం జరిగింది. రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయి నల్లగొండ రోడ్డు కిందకు కావడం..విస్తరణ జరుగుతున్న రోడ్డు ఎత్తుగా ఉండటంతో పైకి ఎక్కాలంటే వాహన చోదకులు ఎక్స్‌లేటర్‌ను మరింత రైజ్ చేయాల్సి వస్తుంది. ఈ ప్రయత్నంలో అదుపు తప్పుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో హుండీ ధ్వంసం



భువనగిరి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామశివారులోని త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీని ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం ప్రధాన అర్చకులు వంశీ, ఆలయానికి వెళ్లి చూడగా హుండీ తాళం ధ్వంసమై ఉండటంతో ఆలయ చైర్మన్ ఓరుగంటి నాగయ్యకు విషయం తెలపగా ఆయన పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వారం రోజులు భక్తులు సమర్పించిన హుండీలో దాదాపు రూ.1000 వరకు దొంగిలించారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లైన్‌మన్‌పై విచారణ

తుంగతుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇంటికి విద్యుత్ కనెక్షన్ కోసం రూ.50వేలు డిమాండ్ చేసిన లైన్‌మన్‌పై ఫిర్యాదు నేపథ్యంలో సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్ విచారణ చేపట్టారు. శనివారం గ్రామాన్ని సందర్శించారు. ఫిర్యాదుదారుడు నిర్మిస్తున్న ఇంటిని పరిశీలించడంతో పాటు లబ్ధిదారుల కుటుంబ సభ్యులను విచారించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏడీఈ తెలిపారు.

రూ.లక్ష మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపిస్తున్న పోలీసులు

చివ్వెంల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వాహనంలో మద్యాన్ని తరలిస్తుండగా మండల సూర్యాపేట జిల్లా చివ్వెంల పోలీసులు దురాజ్‌పల్లి వద్ద పట్టుకున్నారు. ఎస్ఐ మహేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం వాహనాల తనిఖీల్లో భాగంగా దురాజ్‌పల్లి వద్ద టీజీ29టీ 0002 నెంబరు గల కారు అనుమతులు లేకుండా 11 క్వార్టర్ కాటన్లను మండలంలోని మున్యానాయక్‌తండాకు తరలిస్తున్నారు. కారు డ్రైవర్ ధరావత్ సైదా, ధరావత్ నాగును విచారించగా మందును కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నారని ఎస్ఐ వెల్లడించారు పంచనామా జరిపి మద్యాన్ని, కారును సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు. సీజ్ చేసిన మొత్తంలో 528 క్వార్టర్ల బాటిళ్ల విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుందని తెలిపారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా అక్రమంగా మద్యాన్ని నిల్వ చేసినా, తరలించినా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహేశ్వర్ హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కబడ్డీ జట్ల ఎంపిక



సూర్యాపేట జిల్లా బాలికల కబడ్డీ జట్టు

కోదాడ టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా హాలియా పట్టణంలో ఈ నెల 2వ తేదీ నుంచి నిర్వహించే 51వ తెలంగాణ రాష్ట్రస్థాయి బాలిక కబడ్డీ పోటీలకు సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో సోమవారం ఎంపిక చేశారు. జట్టు వివరాలను సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అల్లం ప్రభాకర్‌రెడ్డి, నామానరసింహారావు ప్రకటించారు. **ఎంపికైన క్రీడాకారులు..** జి. శ్రీజా, బి. లహరి, ఎం. వైష్ణవి, ఆర్. దీప్తి, బి. అక్షర, సీహెచ్ అమూల్య, ఎం. సాహితీ, టి. హర్షిత, కే. కళ్యాణి, పి. నందిని, డి. అక్షయ, ఎం. శివాని, ఎన్. శ్రీలేఖ, ఏ. దివ్య, జై. గంగోత్రి ఉన్నారు. వీరికి కోచ్‌గా టి. రమేష్‌బాబు వ్యవహరిస్తారు. నల్లగొండ జిల్లా హాలియా పట్టణంలో డిసెంబరు 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే తెలంగాణ 51వ తెలంగాణ రాష్ట్ర కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ శెట్టి రామచంద్రరావు, కోశాధికారి మాతంగి సైదులు, జాయింట్ సెక్రటరీ టి. రమేష్‌బాబు, అరేంజ్మెంట్ కమిటీ కన్వీనర్ బసవయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లా బాలికల కబడ్డీ జట్టు

నాగార్జునసాగర్: నల్లగొండ జిల్లా అనుమల మండలం హాలియాలో ఈ నెల 2,3,4,వ తేదీల్లో జరిగే 51వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నల్లగొండ జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌కే. అయేషా(ఆలీనగర్), ఎన్. కీర్తి (ఇబ్రహీంపేట), ఎండి.ఆఫ్షా(ఆలీనగర్), వి.సాయిఅభిజ్ఞ(తిరుమలగిరి), టి హన్సిక(తిరుమలగిరి), ఆర్. అభినయశ్రీ(కట్టంగూరు), సి. సంతోషిణి(నల్లగొండ), వి.లక్ష్మీ(పెద్దమునిగల్), ఐ.చందన(చెరుకుపల్లి), జి. అనూత్న(హాలియా), వైష్ణవి(మునుగోడు), ఏ. భవ్యశ్రీ(మదారిగూడెం), సీహెచ్.సంధ్య(దామరచర్ల), ఎన్. పావని(ఇబ్రహీంపేట), ఆర్. వాగ్దేవి(అనుముల) ఎంపికయ్యారు. కోచ్‌గా అన్వర్ ఖాన్, మేనేజర్‌గా పరమేష్ వ్యవహరిస్తారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థి



బాలరాజు

వలిగొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని లోతుకుంట ఆదర్శ పాఠశాల విద్యార్థి కనకబోయిన బాలరాజు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ ఐలయ్య తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి కనగల్‌లో జరిగిన ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రహీసున్నీసా బేగం, ఉపాధ్యాయులు రాజు, లింగస్వామి అభినందించారు.

ఖోఖోలో నర్సింగ్‌బట్ల విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకున్న నర్సింగ్‌బట్ల పాఠశాల జట్టు

నల్లగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో గత నెల 28, 29 తేదీల్లో జరిగిన పీఎంశ్రీ పాఠశాలల జిల్లాస్థాయి ఖోఖో బాలికల విభాగంలో నల్లగొండ మండలంలోని నర్సింగ్‌బట్ల పాఠశాలకు మొదటి బహుమతి లభించింది. జిల్లాలోని 24 పీఎంశ్రీ పాఠశాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. ఈ నెలలో హైదరాబాద్‌లో జరిగే పీఎంశ్రీ పాఠశాలల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. గెలుపొందిన జట్టును ప్రధానోపాధ్యాయుడు డి. మారయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ మల్లీశ్వరి, ఉపాధ్యాయులు యాదయ్య, గోపాల్‌రెడ్డి, యాదగిరి, సైదులురావు, రవీంద్రచారి, వినోద్ కుమార్, వేణుకుమార్, రామకృష్ణ, పద్మావతి, శ్రీదేవి, వాణి తదితరులు అభినందించారు.

అండర్-19 ఖోఖో క్రీడాకారుల ఎంపిక

కనగల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కనగల్ ఎస్‌పీవీఎం మోడల్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-19 ఖోఖో బాలబాలికల ఎంపికలు ప్రశాంతంగా ముగిశాయి. 200మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 12 మంది బాలికలు, 12 మంది బాలికలను రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ కుంభం నర్సిరెడ్డి, తరాల జగదీష్ తెలిపారు. ఈ నెల 5, 6, 7వ తేదీల్లో సికింద్రాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ఉమ్మడి జిల్లా తరుపున పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రిటైర్డ్ ఎస్‌ఐ పందుల శంకరయ్య క్రీడా దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈవో పద్మ, ఎస్‌ఐ రాజీవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ థామసయ్య, వజియా తబ్బుమ్, పీడీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

7న సైన్స్ టాలెంట్ టెస్ట్

మిర్యాలగూడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అల్లం కిరణ్ మెమోరియల్ టాలెంట్ టెస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 7న సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కిరణ్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2007 డిసెంబరు 13న అమెరికా లూసియానా స్టేట్ యూనివర్శిటీలో జరిగిన కాల్పుల్లో మరణించిన తెలంగాణ యువ శాస్త్రవేత్త అల్లం కిరణ్ వర్ధంతి సందర్భంగా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సైన్స్‌పై విద్యార్థులు ఆసక్తిని పెంపొందించడానికి 7, 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు ఈ నెల 7న టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో తరగతి వారిగా టాలెంట్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 6వ తేదీ సాయంత్రం 5గంటల లోపు బైపాస్ రోడ్డులోని లోటస్ స్కూల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పాఠశాల నుంచి ఐదుగురు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని చెప్పారు. ఎలాంటి ప్రవేశ రుసుం లేదని తెలిపారు. మ్యాథ్స్ ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రతి సబ్జెక్ట్ నుంచి 20 మార్కుల చొప్పున పరీక్ష 60 మార్కులకు ఉంటుందని ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు. డిసెంబరు 12న అల్లం కిరణ్ మెమోరియల్ అవార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు.

మంచి సందేశమిచ్చారు..



'డబ్బు, మద్యానికి ఓటు అమ్ముకోము' అని ఇంటి ప్రహరీపై నినాదం రాయించి సమాజానికి మంచి సందేశం ఇచ్చారని నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం మేటి చందాపురం గ్రామానికి చెందిన పగిళ్ల రామచంద్రం, జ్యోతి దంపతులను పలువురు కొనియాడారు. దంపతులను గ్రామస్థులు సోమవారం సన్మానించారు. ఓటును మద్యం, డబ్బుకు అమ్ముకోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వేసుకోవాలని అన్నారు. ఈ సందేశం కనువిప్పుగా ఉందని వారన్నారు.

● ఆంధ్రజ్యోతి, మర్రిగూడ

సీఎం సారూ.. ఇటు చూడరూ

● 20ఏళ్లుగా లైనింగ్ పనులకు నోచని ఏఎమ్మార్పీ ● ముందుకుసాగని ఎత్తిపోతల పనులు ● సీఎం పర్యటనతోనైనా ప్రాజెక్టులకు మోక్షం కలిగేనా ● 6న దేవరకొండలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

దేవరకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, పెండ్లిపాకల ప్రాజెక్టులతోపాటు ఎత్తిపోతల పథకం పనులకు తరచూ అంతరాయం కలుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. పలు పర్యాయాలు నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు పనులను వేగవంతంగా పూర్తిచేసి సాగునీరు అందించాలని ముందుకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 6వ తేదీన దేవరకొండలో పలు అభివృద్ధి పనులతోపాటు బహిరంగ సభ నిర్వహించనున్నారు. సీఎం రాకతోనైనా ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయింపు, భూపరిహారం, పునరావాసం అందుతుందన్న ఆశాభావాన్ని నియోజకవర్గ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.



నిర్మాణానికి నోచని పెండ్లిపాకల ప్రాజెక్టు

20ఏళ్లుగా మరమ్మతులకు నోచక..

2001లో ప్రారంభమైన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు 20ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. ప్రాజెక్టు ప్రధాన కాల్వ 133 కిలోమీటర్ల మేర ఇరువైపులా కంపచెట్లు పెరిగి కోతకు గురైంది. డిస్ట్రిబ్యూటరీలు కూడా ధ్వంసమయ్యాయి. దీంతో నీరు వృథాగా పోయే పరిస్థితి. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ మరమ్మతులకు రూ.442 కోట్లు కేటాయించారు. టెండర్లు ఖరారు చేయడంతోపాటు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. దీంతోనైనా పనులు వేగవంతంగా పూర్తయి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతుం దని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏఎమ్మార్పీ కింద 2.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. రెండు పంటలకు నీరు విడుదల చేస్తున్నారు.

డిండి ఎత్తిపోతల పనులకు రూ.1800 కోట్లు కేటాయింపు

2005లో డిండి ఎత్తిపోతల పథకానికి అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో డిండి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. కాని ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లకు ఎక్కడి నుంచి నీరు ఇస్తారనేది నిర్ధారించలేదు. సరిపడా నిధులు కేటాయించకపోవడంతో రిజర్వాయర్ పనులతోపాటు భూపరిహారం, పునరావాసం ప్రక్రియ జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునరావాసం, భూనిర్వాసితులకు పరిహారం ప్రక్రియ చేపట్టింది. ఎదుళ్ల నుంచి డిండికి నీరు అందించేందుకు రూ.1800 కోట్లు కేటాయించింది.

పెండ్లిపాకలకు మోక్షం వచ్చేనా

పెండ్లిపాకల రిజర్వాయర్ ఎత్తుపెంపు, ఎస్ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్ పనులు గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. 20శాతం వరకు పనులు పూర్తిచేసి నిలిపివేశారు. కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పునరావాసం, పరిహారం అందాల్సిఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్, పెండ్లిపాకల ఎత్తు పెంపు పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేపట్టింది. టెండర్లు ఖరారు కావలసి ఉంది.



కంపచెట్లు పెరిగి శిథిలావస్థకు చేరిన ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ

ప్రాజెక్టులు పూర్తిచేసి సాగునీరు అందించడమే లక్ష్యం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దేవరకొండ నియోజకవర్గంలోని ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తూ ప్రత్యేక దృష్టి సారించారు. శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ప్రాజెక్టులు ముందుకు సాగలేదు. ప్రాజెక్టులను పూర్తిచేసి అన్ని గ్రామాలకు సాగునీరు అందించడమే లక్ష్యం.

● బాలునాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

తరచూ ఆగుతున్న అంభాభవాని ఎత్తిపోతల పనులు

గుట్టలపై ఉన్న గ్రామాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో అప్పటి సీఎం కేసీఆర్ నాగార్జునసాగర్ ఉప ఎన్నికలో భాగంగా రూ.585 కోట్లతో ఎత్తిపోతల పథకం పనులకు 2021లో శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభమయ్యాయి. చందంపేట మండలం పొగిళ్ల, కంభాలపల్లి, పీఏపల్లి మండలం ఏకేబీఆర్, పెద్దగట్టు, నేరేడుగొమ్ము మండలం అంభభవాని లిఫ్టు పనులు ప్రారంభించారు. కానీ ఎత్తిపోతల పనులకు అటవీశాఖ అనుమతులురాకపోవడం, తరుచూ వర్షాలు కురుస్తుండడం, పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఎత్తిపోతల పథకం పనులు తరచూ ఆగుతున్నాయి. మరికొన్ని ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభంకాలేదు. అటవీశాఖ అనుమతులు రావల్సి ఉంది. ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే 40వేల ఎకరాల వరకు గుట్టలపై ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందనుంది.

అయ్యప్పస్వాముల గిరిప్రదక్షిణ

● భజనలు, కీర్తనలతో ప్రతిధ్వనించిన దివ్యక్షేత్రం ● అయ్యప్పస్వాములు దర్శించుకునేందుకు ఉభయ దర్శనాల నిలిపివేత



గిరిప్రదక్షిణలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

యాదగిరిగుట్ట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన అయ్యప్ప స్వాములు సోమవారం సామూహిక గిరిప్రదక్షిణ చేశారు. ఉదయం ఆరు గంటలకు వైకుంఠద్వారం వద్ద ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, బసర పీఠాధిపతి గురుస్వామి వెంకటేశ్వరశర్మ ప్రత్యేక పూజలు చేసి పూజారులు హారతి నివేదించగా ప్రదక్షిణను ప్రారంభించారు. అయ్యప్ప పల్లకి, గోమాతతో స్వాములు ముందుకు కదిలారు. దారి పొడవునా అయ్యప్ప, లక్ష్మీనరసింహ స్వాములను స్తుతిస్తూ ముందుకు సాగారు. కొండచుట్టూ రెండున్నర కిలోమీటర్ల మేర 45నిమిషాల్లో మధ్యాహ్నం వరకు సుమారు 25వేల స్వాములు గిరిప్రదక్షిణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన స్వాములతో వైకుంఠద్వారం(కూడలి) నిండిపోయింది. ప్రదక్షిణ పూర్తి చేసుకున్న అయ్యప్పలు సమూహంగా మెట్ల దారిలో నల్లచీమల దండులా తూర్పు రాజగోపురం గుండా వెళ్లి గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకున్నారు. స్వాములు దర్శించుకునేందుకు ఉభయ దర్శనాలు నిలిపివేశారు. 9గంటలకు బ్రేక్ దర్శనం ప్రారంభించారు. ఉదయం 10 గంటల వరకు రూ.150 ప్రత్యేక దర్శనం, ధర్మదర్శనం భక్తులు ఉభయ క్యూలైన్లల్లో వేచి ఉన్నారు. అయ్యప్ప స్వాములందరికీ రూ.3లక్షల విలువైన 230కిలోల లడ్డు ప్రసాదాలు వితరణ చేశారు. ఉభయ క్యూలైన్లలో సాధారణ భక్తులు ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనాలు, మధ్యాహ్నం(గంట ఆరగింపు) సమయాలు కలిపి మూడు గంటల పాటు వేచి ఉన్నారు. ఆదివారం రాత్రి నుంచే యాద గిరిగుట్టకు చేరుకున్న స్వాములకు కొండపైన డార్మెంటరీ హాల్, కింద పాత గోశాల డార్మెంటరీ హాల్, కల్యాణ మండపం బస చేసేందుకు కేటాయించారు. ఈవో ఎస్. వెంకట్రావు మాట్లాడుతూ వైష్ణవ ఆలయంలోని స్వయంభువులను అయ్యప్ప మాలధారణ స్వాములు దర్శించుకోవడం శుభపరిణామమన్నారు. యాదగిరిగుట్ట ఏసీపీ పి. శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

లక్ష్మీనరసింహుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనా పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టగా పాంచరాత్రాగమన రీతిలో గంటపాటు పూజా పర్వం కొనసాగింది. కొండపై శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విష్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 24,41,558 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

చెక్కుచెదరని దీపపు స్తంభం

● మఠంపల్లిలో ఉన్న 25 అడుగుల రాతి దీపపు స్తంభం



నాగరికత ఊసే లేని నాటి రోజుల్లో ఆముదపు దీపాల వెలుగులోనే పనులు చక్కదిద్దుకునేవారు. అప్పట్లో ఎక్కడికి వెళ్లాలన్నా కాలినడకే శరణ్యం. దూర ప్రాంతాలైతే ఎడ్ల బండిపై రోజుల తరబడి ప్రయాణం చేసి గమ్యస్థానానికి చేరుకునే వాళ్లు. తీర్థయాత్రలకు వెళ్లే బాటసారులు గ్రామాల్లో బస చేసేందుకు సత్రాలు ఉండేవి. వారికి తమ ఊరి ఉనికి తెలిసేలా ప్రతి పల్లెలోనూ ప్రధాన కూడలిలో రాతి దీపపు స్తంభాలు ఉండేవి. 20 నుంచి 30 అడుగుల ఎత్తులో ఉంటే ఈ స్తంభాలపై మట్టి మూకుళ్లలో ఆముదపు దీపం వెలిగించి గాలి తాకిడి లేకుండా అద్దాల కవచం పెట్టేవారు. రాత్రివేళల్లో ప్రయాణం చేసే ఈ వెలుగును చూసి దగ్గర్లో గ్రామం ఉన్నట్లు గుర్తించి అక్కడికి చేరుకునేవారు. శతాబ్దాల నాటి దీపపు స్తంభం సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలకేంద్రంలో ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. పూర్వం గ్రామం నడిబొడ్డున ఓ రాతి దిమ్మె దానిపై 25 అడుగుల ఎత్తులో ఉన్న స్తంభం పైకి నిత్యం దీపం వెలిగించేందుకు మెట్టు ఉన్న ఆనవాళ్లు ఇక్కడ ఉన్నాయి. ఎన్నో ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని ఇప్పటికీ ఈ దీపపు స్తంభం నిలిచి ఉండడం విశేషం.

● ఆంధ్రజ్యోతి, మఠంపల్లి

మానవ సేవే మాధవ సేవ: గుట్ట ఈవో

యాదగిరిగుట్ట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవగా భావించి ప్రతి ఉద్యోగి విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని యాదగిరిగుట్ట ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు అన్నారు. సోమవారం కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. అయ్యప్ప స్వాముల గిరిప్రదక్షిణలో ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు లేకుండా సమర్థంగా విధులు నిర్వహించారని ఎస్పీఎఫ్ సిబ్బందిని అభినందించారు. అధికారులు సమన్వయంతో సదుపాయాలు మరింత మెరుగుపర్చడం, రద్దీకి నియంత్రణ చర్యలు చేపట్టడం తదితర అంశాలపై స్పష్టంగా ఉండాలని సూచించారు. అన్నదాన సత్ర భవనంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు జూశెట్టి కృష్ణ, గజ్వేల్లి రఘు, నాగుల మహేష్‌గౌడ్, సివిల్ విభాగం ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి జాటోత్ శంకర్‌నాయక్, పర్యవేక్షకుడు మాచర్ల రాజన్‌బాబు, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు పాల్గొన్నారు.



కంట్రోల్ రూం వద్ద ఎస్పీఎఫ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఈవో వెంకట్రావు

యూత్ హాస్టల్‌పై నీలినీడలు

- వసతుల లేమి, అధికారుల పర్యవేక్షణ కరువు
- రెండేళ్లుగా మూతపడిన యూత్ హాస్టల్
- 22 సంవత్సరాల క్రితం ఏర్పాటైన హాస్టల్

ప్రపంచ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్ హిల్ కాలనీలో కేంద్ర ప్రభుత్వం యూత్ సర్వీసెస్, స్పోర్ట్స్ శాఖల ఆధ్వర్యంలో 22 సంవత్సరాల క్రితం యూత్ హాస్టల్ ఏర్పాటు చేసింది. మొదట్లో ఈ హాస్టల్ క్రీడాకారులు, పర్యాటకులు, యువత, విద్యార్థులతో కళకళలాడేది. తక్కువ ధరకే గదులు అద్దెకు ఇచ్చేవారు. ఒకప్పుడు కళకళలాడిన ఈ హాస్టల్ ప్రస్తుతం సందడి లేక బోసిపోతోంది. పర్యవేక్షణ, వసతుల లేమితో ఆదరణ కరువవుతోంది. రెండేళ్లుగా దీనిని కనీసం పట్టించుకునే వారు కరువయ్యారు.

- ఆంధ్రజ్యోతి, నాగార్జునసాగర్



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా దేశంలోని పలు పర్యాటక ప్రాంతాల్లో యూత్ హాస్టళ్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. ఉమ్మడి ఏపీకి మూడు హాస్టళ్లు మంజూరయ్యాయి. 45సంవత్సరాల హైదరాబాద్‌లో25 సంవత్సరాల క్రితం వరంగల్‌లో ఏర్పాటయ్యాయి. 22సంవత్సరాల క్రితం సాగర్ హిల్‌కాలనీలో 1997 ఏప్రిల్ 10వ తేదీన ఉమ్మడి ఏపీహోంశాఖ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి యూత్ హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2003 ఏప్రిల్ 28వ తేదీన ఉమ్మడి ఏపీలో నాటి యువజన క్రీడల శాఖ మంత్రి రాములు ప్రారంభించారు.

ప్రస్తుతం మేరా యువ భారత్ నిర్వహణలో..

2016 నుంచి 2024 డిసెంబరు వరకు నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ హాస్టల్ 2025 నుంచి కేంద్ర ప్రభుత్వం పథకం 'మేరా యువ భారత్' పథకంలోకి మారింది. దీనికి జిల్లా కోఆర్డినేటర్‌గా హైదరాబాద్ యూత్ హాస్టల్ కో-ఆర్డినేటర్ రాజేష్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నిధులు లేక.. మరమ్మతులకు నోచక

శిథిలావస్థకు చేరుతున్న యూత్ హాస్టల్‌కు మరమ్మతులు చేయలేదు. 2015 నుంచి వాటర్ బిల్లులు చెల్లించకపోవడంతో ఎన్నెస్పీ అధికారులు కనెక్షన్ తొలగించారు. కొంతకాలం నీటి సమస్యతో ఉన్న యూత్ హాస్టల్‌కు మళ్లీ ఎన్నెస్పీ అధికారులతో మాట్లాడి నీటి కనెక్షన్‌ను పునరుద్ధరించారు. బుద్ధవనం అధికారులతో పాటు, సాగర్ ప్రధాన డ్యాంపై విధులు నిర్వహిస్తున్న తమ వసతి భవనం కోసం యూత్ హాస్టల్ కావాలని గత ఏడాది సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి లేఖలు రాశారు దీనిపై కలెక్టర్ నిర్ణయం తీసుకోలేదు.

కలెక్టర్‌కు లేఖలు రాస్తాం

నాగార్జునసాగర్ యూత్‌హాస్టల్ మరమ్మతులు చేసి యువతకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి లేఖ రాస్తాం. వీలైనంత త్వరలో యూత్ హాస్టల్‌ను అందుబాటులోకి తెస్తాం.

- రాజేష్, మేరా యువ భారత్ ఇన్‌చార్జి జిల్లా కోర్డినేటర్

ఏడేళ్లగా వేతనాలు ఇవ్వడం లేదు



2018 ఏప్రిల్ నుంచి ఏడేళ్లుగా వేతనాలు అందడంలేవు. దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలి

- దాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, యూత్ హాస్టల్ కేర్ టేకర్

ఎనిమిది డార్మిటరీలు.. వంద పడకలు

యూత్ హాస్టల్‌లో ఎనిమిది డార్మిటరీల్లో 100 పడకలు, మరో రెండు గదులు ఏర్పాటు చేశారు. 24గంటల కోసం ఒక్కోబెడ్‌కు రూ.80 అద్దె వసూలు చేస్తారు. గదికి అయితే రూ.500 వసూలు చేస్తారు. దీని నిర్వహణను మొదటి స్టెప్(సపోర్ట్ టూ ట్రైనింగ్ అండ్ ఎంపవర్ మెంట్ ప్రోగ్రాం)కు అప్పగించారు. కేర్ టేకర్, స్వీపర్, తోటమాలి, వాచ్‌మన్‌ను దినసరి కూలీలుగా నెలకు రూ.40వేలు (నలుగురికి) వేతనాలు చెల్లించేవారు. 2015 వరకు స్టెప్ నిర్వహణలో ఉన్న యూత్ హాస్టల్‌కు 2016లో రూ. 10.86 లక్షలతో మరమ్మతులు చేయించి నెహ్రూ యువ కేంద్రానికి అప్పగించారు. రెండేళ్లపాటు బాగానే నడిచిన హాస్టల్ 2018 నుంచి సరైన సదుపాయాలు లేకపోవడంతో పాటు, నీటి సౌకర్యం కూడా లేక ఇక్కడ అద్దె తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. 2018 నుంచి అక్కడ పనిచేసే నలుగురు ఉద్యోగులకు వేతనాలు కూడా కష్టంగా మారాయి. దీంతో ముగ్గురు ఉద్యోగులు కుటుంబాల పోషణకోసం వేరే ఉపాధి వెతుక్కున్నారు. ప్రస్తుతం కేర్ టేకర్ దాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాత్రమే యూత్ హాస్టల్‌ను చూసుకుంటున్నాడు. ఏడేళ్లుగా వేతనం రావడం లేదని ఆయన వాపోతున్నాడు.

డివిజన్‌లో రూ.40 కోట్లు పెండింగ్



హుజూర్‌నగర్ మండలంలో సర్పంచ్‌లకు రావాల్సిన బకాయిలు	
అమవరం	: రూ.30లక్షలు
బూరుగడ్డ	: రూ.12లక్షలు
వేపలసింగారం	: రూ.15లక్షలు
గోపాలపురం	: రూ.8లక్షలు
లింగగిరి	: రూ.20లక్షలు
శ్రీనివాసపురం	: 10లక్షలు
లక్కవరం	: 12లక్షలు
మర్రిగూడెం	: 4లక్షలు
కరక్కాయలగూడెం	: 15లక్షలు
సీతారాంపురం	: రూ.10లక్షలు
అంజలిపురం	: రూ.5 లక్షలు

- పదవీకాలం పూర్తయ్యే.. పైసలు రాకపాయె
- అప్పుల ఊబిలో మాజీ సర్పంచ్‌లు
- బిల్లుల కోసం రెండేళ్లుగా ఎదురు చూపులు
- ఉపాధి కోసం వలస వెళ్లి న మాజీ సర్పంచ్‌లు

అప్పుల ఊబిలో మాజీ సర్పంచ్‌లు కూరుకున్నారు. పదవీ కాలం ముగిసి రెండేళ్లయినా ఇంకా గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు రాలేదు. దీంతో ఆస్తులు విక్రయించి అప్పులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సర్పంచ్‌గా పనిచేసిన ఎంతో మంది పదవీ కాలం పూర్తయినే పూర్వపు పనులు చేసుకుంటున్నారు. కొంతమంది సర్పంచ్‌లు వ్యవసాయ పొలాలు అమ్మి అప్పులు చెల్లించారు. దీంతో పాటు వలస వెళ్లి పొలాలు కౌలుకు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి - హుజూర్‌నగర్)

సర్పంచ్ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ నోటిఫికేషన్ జారీచేసింది. గతంలో సర్పంచ్‌లుగా పనిచేసిన నాయకులు బిల్లులు రానందున దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సర్పంచ్‌లుగా ఎన్నికై ఉత్సవ విగ్రహాలుగా ఉండలేక అప్పులు చేసి మరీ అభివృద్ధి పనులు చేశారు.హుజూర్‌నగర్ ప్రాంతంలోఎంతోమంది సర్పంచ్‌లు అప్పుల కోసం వ్యవసాయ భూములు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

హుజూర్‌నగర్ డివిజన్‌లోని ఏడు మండలాల్లో సమారు 146 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సర్పంచ్‌లకు సుమారు రూ.8 కోట్లకు పైగా నిధులు రావాల్సి ఉంది. ఒక్కో మండలంలో రూ.50 లక్షల నుంచి రూ.కోటి రూపాయల వరకు సర్పంచ్‌లకు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు. డివిజన్‌లోని హుజూర్‌నగర్ మండలంలో 11 గ్రామపంచాయతీలకు సంబంధించి సుమారు రూ.72 లక్షలకు పైగా బిల్లులు నిలిచిపోయాయి. అదేవిధంగా చింతలపాలెం మండలంలో రూ.1.65కోట్లకు పైగా నిధులు రావాల్సి ఉంది. దీంతో పాటు మేళ్లచెరువు మండలంలో 16 గ్రామపంచాయతీలకు రూ.85 లక్షలకు పైగా బిల్లులు నిలిచిపోయాయి. వీటితో నేరేడుచర్ల మండలంలో సుమారు రూ.55లక్షలు, పాలకవీడు మండలంలో రూ.63లక్షలు, మఠంపల్లి మండలంలో రూ.70లక్షలు, గరిడేపల్లి మండలంలో రూ.132లక్షల బకాయిలు సర్పంచ్‌లకు రావాల్సి ఉంది. కాగా హుజూర్‌నగర్ మండలంలోని ఒక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేసిన సమయంలో ఒక అభ్యర్థి రెండు ఎకరాల పొలం విక్రయించి పోటీ చేశారు. కాగా సర్పంచ్ పదవీ కాలం ముగిసిన తర్వాత తర్వాత ఉన్న మరో రెండు ఎకరాలను కూడా విక్రయించి అప్పులు చెల్లించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆ మాజీ సర్పంచ్ పొలం మొత్తం విక్రయించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లి 30 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు.

ఆ సర్పంచ్ కుటుంబం ఎన్నికలలో పోటీచేసి ఉన్న నాలుగు ఎకరాలు విక్రయించి అప్పులపాలైంది. సన్న, చిన్నకారు రైతు కుటుంబానికి చెందిన మాజీ సర్పంచ్ ఇప్పుడు జీవన పోరాటం చేస్తున్నారు. బిడ్డలను వదిలి భార్యతో సహా వెళ్లి కౌలుకు సాగు చేస్తున్న వైనం అందరి హృదయాలను కలచివేస్తోంది. ఇదిలా ఉండగా హుజూర్‌నగర్ మండలంలోని మరో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి ఉన్న ఆస్తులు విక్రయించి, పెండింగ్ బిల్లులు రాక పూర్వపు వృత్తి టెంట్ హౌస్ నిర్వహించుకుంటూ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. కాగా రిజర్వేషన్లలో సర్పంచ్‌గా ఎన్నికైన మరో మాజీ సర్పంచ్ గతంలో గ్యాస్ వెల్డర్‌గా పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పదవీ కాలం పూర్తయిన తర్వాత కటుంబ పోషణ కోసం హుజూర్‌నగర్‌లో పూర్వపు వృత్తిని కొనసాగిస్తున్నారు. ఇలా ఎంతోమంది తాజా మాజీ సర్పంచ్‌లు పదవీ కాలం పూర్తయి చేసిన పనులకు బిల్లులు రాక అప్పుల ఊబిలో కూరుకుని గత వృత్తులను కొనసాగిస్తూ జీవన పోరాటం చేస్తున్నారు.

అప్పులతో పొలం విక్రయించా



గత సర్పంచ్ ఎన్నికలలో పోటీచేసి ఉన్న అప్పుల పాలయ్యాం. ఉన్న నాలుగు ఎకరాలను విక్రయించా. చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయమే మా వృత్తి అయినందున పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా బిల్లులు చెల్లించాలి.

- గుజ్జుల సుజాత, అమరవరం తాజా మాజీ సర్పంచ్

గ్యాస్ వెల్డర్‌గా పనిచేస్తున్నాను



గత సర్పంచ్ ఎన్నికల్లో మర్రిగూడెం నుంచి పోటీ చేసి గెలుపొందాను. ఉన్న ఎకరం పొలం విక్రయించాను. పిల్లలు చదువుకునే దశలో రాజకీయాల్లోకి వచ్చా. 30ఏళ్లు కష్టపడి సంపాదించిన సొమ్మంతా ఎన్నికల్లో ఖర్చు చేశా. గతంలో హుజూర్‌నగర్‌లో గ్యాస్ వెల్డర్‌గా పనిచేశాను. మళ్లీ ఇప్పుడు అదే వృత్తిని కొనసాగిస్తున్నాను.

-సైదులు, తాజా మాజీ సర్పంచ్, మర్రిగూడెం

విద్యార్థికి ఆర్థికసాయం

నూతనకల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన మరిపల్లి ఉమ పరుగు పందెంలో రాణిస్తూ జాతీయ స్థాయికి ఎంపికైంది. ఢిల్లీలోఈ నెల 7న జరిగే అంతర్జాతీయ స్థాయి 50కిలో మీటర్ల పరుగు పందెంలో భారత దేశం తరపున పాల్గొననుంది. ఆమెకు అదే గ్రామానికి చెందిన వీరబోయిన రాజశేఖర్ సోమవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొరివి మధు, రాజేష్, దయాకర్,పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత మృతి



ఆంజనేయులు (ఫైల్ ఫొటో)

హుజూర్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత, హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కస్నె గుండ్ల ఆంజనేయులు (75) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య కుమార్తె ఉన్నారు. గరిడేపల్లి మండలం సర్వారం గ్రామానికి చెందిన ఆంజనేయులు 30ఏళ్ల క్రితం హుజూర్‌నగర్‌లో స్థిరపడ్డారు. ఆంజనేయులు మృతి పట్ల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసు సంతాపం తెలిపారు.

టీడీపీలో చేరికలు

కోదాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొరకుంట గ్రామంలో బీఆర్ఎస్‌కు చెందిన 50 కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారికిముంద్రా అప్పారావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఉచిత శిక్షణ

సూర్యాపేటటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీఎల్) ఆధ్వర్యంలో యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ఎన్ఏసీఎల్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్. రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో యువతకు ల్యాండ్ సర్వేయర్, సూపర్‌వైజర్ స్ట్రక్చర్, ఎలక్ట్రికల్, టైలరింగ్ కోర్సుల్లో 90 రోజుల పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు నల్లగొండలోని కార్యాలయం సెల్ నెం. 7893332674, 8297431655, 8498065139 సంప్రదించాలన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కోదాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హమాలీ లకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు కోటగిరి వెంకట్‌నారాయణ కోరారు. సోమవారం పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఐరన్ హార్డ్‌వేర్ దుకాణాల యాజమాన్యాలతో కార్మికులు, కార్మిక సంఘం నేతలతో కలిసి ఎగుమతి, దిగుమతి నూతన వేతన ఒప్పందం చేసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ముత్యాలు, కార్మికులు రాములు, వీరయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 11గ్రామాల అభ్యర్థుల ప్రకటన

చింతలపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలం లోని 16 పంచాయతీలకు 11 గ్రామాల్లో కాంగ్రెస్ మద్దతుతో సర్పంచ్ పదవులకు బరిలో ఉన్న అభ్యర్థుల జాబితానుఆ పార్టీ సమన్వయ కమిటీ సోమవారం విడుదల చేసింది. మిగిలిన ఐదు గ్రామ పంచాయతీల అభ్యర్థుల జాబితాను మంగళవారం ప్రకటిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. 11 గ్రామాల అభ్యర్థుల జాబితా - గుగులోతు శ్రీను(నక్కగూడెం), షేక్ అమినాబీ దాదాబుడే (కిష్టాపురం), జెట్టి నాగిరెడ్డి (అడ్లూరు), కన్న అరుణ హనుమంతరావు, శోభనాద్రిగూడెం సైదులు (పీక్ల నాయక్ తండా), మాలావత్ శారద సామ్య(కొత్తగూడెం), భూక్యా బాలాజీ(యర్రకుంటతండా), కొండపల్లి సుందర్రావు (వజినేపల్లి), కొల్ల భూలక్ష్మి తాటిరెడ్డి(పులిచింతల ప్రాజెక్టు కాలనీ, నెమలిపురి), దొంగల వీరమ్మ వెంకటేశ్వర్లు(గుడిమల్కాపురం) ఉన్నారు. ఈ కార్యక్రమంలో నరాల కొండారెడ్డి, చిలకల శ్రీనివాసరెడ్డి, ఇంద్రారెడ్డి, పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ చేస్తే కేసులు



తిరుమలగిరిలో వాహనారునికి డ్రంకెన్ డ్రైవ్ టెస్టు చేస్తున్న ఎస్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి

తిరుమలగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

నియంత పాలన చేస్తున్న కాంగ్రెస్



సూర్యాపేటలో మంత్రి కోమటిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సూర్యాపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నియంత పాలన సాగిస్తోందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల్ల నర్సింహ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు అన్నారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెం గ్రామంలో సర్పంచ్ పదవికి పోటీలో ఉన్న మహిళ భర్తను కిడ్నాప్ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని మహాత్మజ్యోతిరావుపూలే విగ్రహం ఎదుట మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌యాదవ్, డేవిడ్‌కుమార్, సైదులుయాదవ్, వెంకన్న,పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

తుంగతుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశితండాకు చెందిన షేక్ జిలాని కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, సాయిలు పాల్గొన్నారు.

నాణ్యత డొల్ల.. ఆరోగ్యం గుల్ల

(5వపేజీ తరువాయి)

కాలుష్యంతో జలచరాలు మృత్యువాత పడుతున్నాయి. ప్రమాదకరమైన ప్లాస్టిక్ వ్యర్థాలను చెరువులు, నీటి కుంటల్లో వేయడంతో ఆ నీటిని తాగే ప్రజలు, జీవచరాలపై ప్రభావం చూపుతోంది. పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు మంచినీటి చెరువులు, కుంటల్లో కలుస్తున్నాయి.

వ్యాధుల బారిన

వివిధ రకాల కాలుష్యాలతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. వాటి చికిత్స కోసం ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఎక్కువగా శ్వాసకోశ, మూత్ర పిండాలు, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వ్యాధులు వస్తున్నాయి. 30శాతం మంది కాలుష్య కారణంగా వివిధరకాల వ్యాధులకు గురై చికిత్సలు పొందుతున్నారు.

మొక్కలే ఏకైక మార్గం

పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించాలంటే మొక్కలు విరివిగా పెంచాలి. అదేవిధంగా పెట్రోల్, డిజిల్ వాహనాల వినియోగం తగ్గించాలి. ప్రత్యామ్నాయంగా సైకిల్స్ వాడాలి. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి. చెరువులు కాలుష్యం కాకుండా మట్టి విగ్రహాలను పూజించి నిమజ్జనం చేయాలి.

రోడ్లపై వచ్చే దుమ్ముతో ఇబ్బంది పడుతున్నాం

రోడ్లపై లేచే దుమ్ముతో ఇబ్బంది పడుతున్నాం. దుమ్ముధూళి శరీరంలోకి చేరి అనారోగ్యం పాలవుతున్నాం. పిల్లలను పాఠశాలకు పంపే సమయంలో బజారుకు వెళ్ళే సమయంలో దుమ్ము, ధూళి గొంతులోకి చేరి గొంతు సమస్యలు వస్తున్నాయి.

● రూప, సూర్యాపేట

ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలి



మేళ్లచెర్వులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

నూతనకల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని వైద్యాధికారి లిఖిత్ అన్నారు.అంతర్జాతీయ ఎయిడ్స్ దినం పురస్కరించుకుని సోమవారం నూతనకల్‌లో 'అడ్డంకులను అధిగమిద్దాం - ఎయిడ్స్ ప్రతి స్పందనను మారుద్దాం' అనే నినాదంతో వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో చరణ్‌నాయక్, చిన్ని, శైలజ, అనూహ్య, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

● మేళ్లచెర్వు: ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం మేళ్లచెర్వు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సీతామహాలక్ష్మి, సూపర్‌వైజర్లు రాజకుమార్, వినోద, వైద్య సిబ్బంది, నిమ్మల వెంకటేష్, ఎల్‌టీ శ్రీనివాస్‌రెడ్డి, ఫార్మసిస్ట్ రాజేష్, ఏఎన్ఎంఎస్ గోవిందమ్మ, రేణుక, నాగకల్యాణి, నాగేంద్రమ్మ, సువర్ణ, స్వరూప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● మద్దిరాల: మద్దిరాల మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మద్దిరాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, డాక్టర్ సందీప్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గరిడేపల్లి: అడ్డంకులను అదిగమిద్దాం- ఎయిడ్స్ ప్రతి స్పందనని మారుద్దామని హెల్త్ సూపర్‌వైజర్ అంజయ్య అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా సోమవారం హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గరిడేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం సెంటరులో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డాక్టర్ అభిలాష్, వెంకటరమణ, నాగేశ్వరరావు, కవిత, విజయ, అంజలి, ఆశా కార్యకర్తలు అంజమ్మ, జయమ్మ, ఉపేంద్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలతోనే ఆదరణ



చివ్వెంల మండలంలోని సూర్యానాయక్‌తండాకు చెందిన యువకులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొప్పుల వేణారెడ్డి

మునగాల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చూసి పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కలకోవ గ్రామా నికి పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల జైపాల్‌రెడ్డి, నల్లపాటి శ్రీనివాస్, కాసర్ల కోటేశ్వరరావు, ఉప్పుల జానకిరెడ్డి, కె . బుచ్చిపాపయ్య, ఉప్పుల యుగంధర్‌రెడ్డి మాతంగి బసవయ్య, కొంపెల్లి సుజాతవీరబాబు, గన్నా నరసింహారావు, మండవ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● నూతనకల్: గ్రామాల అభివృద్ధి కోసం ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని మండలంలోని ఎర్రపహాడ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల రామచంద్రయ్య అన్నారు. సోమవారం ఆ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు ధర్మారపు సురేష్, ఇరుగు మహేందర్, ఇరుగు రాకేష్‌లు కాంగ్రెస్‌లో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జలగం యోగానందం, సర్పంచ్ అభ్యర్థి అనంతుల నాగలింగం, గుర్రం సత్యనారాయణ, పసుల వెంకన్న, అశోక్‌యాదవ్, రామకృష్ణ ఉన్నారు.

● అర్వపల్లి: పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు ఉన్న సర్పంచ్ అభ్యర్థుల విజయానికి పార్టీ కార్యకర్తలు కలికట్టుగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం అర్వపల్లిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో 17గ్రామ పంచాయతీలకు కాంగ్రెస్ మద్దతు ఉన్న సర్పంచ్ అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామన్నారు. పార్టీ క్రమశిక్షణ పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో నాయకులు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, నసీర్‌గౌడ్, మంచాల రాంమూర్తి, కృష్ణమూర్తి, విజయ్, నాగరాజు, జయంతి పాల్గొన్నారు.

● భానుపురి: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో చివ్వెంల మండలంలోని సూర్యానాయక్‌తండా యువకులు, సూర్యాపేట మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన ఆరాల వెంకటేశ్వర్లుతో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వేణారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ ధరావత్ వీరన్ననాయక్, మాడుగుల నవీన్‌కుమార్, చందాదాస్, ఆరాల సైదులుయాదవ్, సాయి ఉన్నారు.

ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు



పొనుగోడులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

గరిడేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నియమావళిపై సోమవారం రాత్రి మండలంలోని పొనుగోడు గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఈ సమయంలో ప్రతిఒక్కరూ నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. గ్రామాల్లో తగాదాలు పెట్టుకోవద్దని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. ప్రజలు ప్రలోభాలకు గురికావొద్దని, స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో అసభ్యకర, అభ్యంతర పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకుంటామ న్నారు. అనంతరం పోలీసు కళాబృందం సభ్యులు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ. చరమందరాజు, ఎస్ఐ చలికంటి నరేష్, పోలీసు కళా బృందం ఇన్‌చార్జి ఎల్లయ్య, సభ్యులు గోపయ్య, చారి, నాగార్జున, కృష్ణ, గురులింగం, సత్యం పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలి: ప్రత్యేక అధికారి



చీదెళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి రాము

పెన్‌పహాడ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియమ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని మండల ప్రత్యేక అధికారి రాము అన్నారు. సోమవారం మండలంలోని గాజుల మల్కాపురం, చీదెళ్ల, ధర్మాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు మండలంలో మొత్తం 29 గ్రామ పంచాయతీలకు గాను ఆదివారం 13 మంది, సోమవారం 59 మంది, మొత్తం 72 మంది అభ్యర్థులు సర్పంచ్ పదవులకు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జానయ్య, ఎంపీవో రాజేశ్వర్, ఎన్నికల నామినేషన్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాత్రి 8 గంటల వరకు కొనసాగిన నామినేషన్ ప్రక్రియ

మండలంలోని 29 గ్రామ పంచాయతీల ఎన్నికలకు రెండో విడత సర్పంచ్, వార్డు సభ్యులకు సోమవారం రాత్రి 8 గంటల వరకు ఆశావహులు నామినేషన్లు వేశారు. నామినేషన్ పత్రాలను తీసుకోవడంలో ఎన్నికల అధికారులు జాప్యం చేస్తున్నందున ఆలస్యం అవుతోందని నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు ఆరోపించారు.

జిల్లాకు భీంరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలి



అదనపు కలెక్టర్ కె.సీతారామరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

సూర్యాపేట టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి(బీఎస్‌రెడ్డి) పేరును సూర్యాపేట జిల్లాకు పెట్టాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కె.సీతారామారావుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపూరి సోమన్న, రమేష్, శ్రీనివాస్, రామోజీ, ఉమేష్ పాల్గొన్నారు.

సమ న్యాయం పాటించాలి



కోదాడలో డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోదాడ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల విషయంలో పోలీసులు సమ న్యాయం పాటించాలని పలువురు బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కోదాడ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌రెడ్డికి కోదాడ పట్టణ బీఆర్ఎస్ నాయకులు సోమవారం కలిసి సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పైడిమర్రి సత్యబాబు, షేక్ నయీం, లలిత, గొర్రె రాజేష్, చలిగంటి వెంకట్, అబ్బు,పాల్గొన్నారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

కోదాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిమిర్యాల సహకార సంఘ పరిధిలో ముమ్మరంగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు సంఘ చైర్మన్ కొత్త రఘుపతి తెలిపారు. సోమవారం కోదాడలో నిర్వహించిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే సంఘ పరిధిలో 27,049.60 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇందుకు రైతుల ఖాతాల్లో రూ.8,85,11,494లు జమ చేశామన్నారు. చిమిర్యాల సహకార సంఘం పరిధిలో దొరకుంట, మంగళితండా, నల్లబండగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈ దఫా సన్నరకం ధాన్యంతో పాటు 1010 రకం ధాన్యం కూడా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. రైతులు తేమ, దుమ్ము, ధూళి లేకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

మద్దిరాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని తుంగతుర్తి సీఐ నర్సింహ అన్నారు. సోమవారం మండలంలోని గోరెంట్ల, చౌళ్లతండ, రాజానాయక్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా సిబ్బంది చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వీరన్న సిబ్బంది పాల్గొన్నారు.

పోటాపోటీగా నామినేషన్లు

కోదాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా సోమవారం రెండో రోజు సర్పంచ్, వార్డు మెంబర్ల పదవుల కోసం అధిక సంఖ్యలో నామినేషన్లు వేశారు. నాలుగు క్లస్టర్ల పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల వరకు ఒకరిద్దరు మాత్రమే నామినేషన్లు వేయగా, అనంతరం ఒక్కో క్లస్టర్ పరిధిలో నామినేషన్లు వేసేందుకు సుమారు 60 మందికి పైగా క్యూ లైన్లలో ఉన్నారు. నల్లబండగూడెం క్లస్టర్ పరిధిలో అల్సకాని భవాని శరబయ్య సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేయగా, చిమిర్యాల నుంచి కాంగ్రెస్ నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కొత్త గురవయ్య సర్పంచ్ పదవికి నామినేషన్ వేశారు. ఇదే గ్రామం నుంచి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు గడిపూడి శ్రీకాంత్ నామినేషన్ వేశారు. వీరిద్దరి మధ్యే పోటీ నెలకొనే అవకాశం ఉంది. దొరకుంటలో సర్పంచ్ పదవి కోసం కాంగ్రెస్ మద్దతుదారులైన పాలకి సురేష్, చౌడపు హనుమంతరావులు నామినేషన్ దాఖలు చేశారు. మంగళితండా నుంచి కాంగ్రెస్ మద్దతుతో బాబ్జి నామినేషన్ వేశారు. దీంతో పాటుగా ఒక్కో క్లస్టర్ వద్ద నామినేషన్లు వేసేందుకు భారీ సంఖ్యలో నాయకులు తరలివచ్చారు. సాయంత్రం ఐదు గంటలకు నామినేషన్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. అయితే ఒక్కో క్లస్టర్ వద్ద 50 మంది క్యూలై న్లలో ఉన్నందున అభ్యర్థులకు టోకెన్లు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. రాత్రి 10 గంటల వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగే అవకాశం ఉందని ఎంపీడీవో హస్సేన్ తెలిపారు.